క్లుప్తంగా

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో 'స్పందన'

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ స్వీకరిస్తారని పేర్కొన్నాయి. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని కోరారు.

ఆటో బోల్తా.. మహిళకు తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన మహిళ

పెనుగొండ: దొంగరావిపాలెం వద్ద జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఆదివారం సిద్ధాంతం నుంచి తణుకు వెళుతున్న వెళుతున్న ఆటో దొంగరావి పాలెం వద్ద అదుపు తప్పి బోల్తా పడింది, ఆటోలో ఉన్న మహిళ తలకు బలమైన గాయం కావడంతో హైవే అంబులెన్స్‌లో తణుకు ఆసుపత్రికి తరలించారు. గాయపడిన మహిళ తాడేపల్లిగూడేనికి చెందిన కట్టా దేవి అని పేర్కొన్నారు.

ముగిసిన శ్రీరామనవమి ఉత్సవాలు


రాజ్యలక్ష్మీ అక్కయ్యను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆకివీడు: ఊరూరా రాములోరి కల్యాణంతో దేశం సుభిక్షంగా ఉంటుందని సహస్రనామ పారాయణ కర్త, గీతా మహిళా మండలి అధ్యక్షురాలు కె.రాజ్యలక్ష్మీ అక్కయ్య చెప్పారు. స్థానిక సంతపేటలోని కల్యాణ రామాలయంలో నవమి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతారామ చంద్రమూర్తులను తలుచుకుంటూ నవమి ఉత్సవాలు ఈ ఏడాది అత్యంత వైభవోపేతంగా నిర్వహించారని చెప్పారు. ధర్మం నాలుగు పాదాలపై నడుస్తుండడంతో దేశం ఎంతో సుభిక్షంగా ఉందని చెప్పారు. అనంతరం రాజ్యలక్ష్మీ అక్కయ్యను ఆలయ కమిటీ ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు జగ్గురోతు విజయ్‌కుమార్, మోరా జ్యోతి, శ్రీనివాసరెడ్డి, కుంచాడ బాబ్జీ, అమర్, జంపన సుబ్రహ్మణ్యంరాజు(జేఎస్సార్), కోమటి రాంబాబు తదితరులు సత్కరించారు. అనంతరం అఖండ అన్న సమారాధన చేశారు. సుమారు 3 వేల మంది భక్తులు రాములోరి ప్రసాదం స్వీకరించారు.

వీరవాసరంలో ధ్యాన శిక్షణ


వీరవాసరంలో ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: పట్టణంలోని శ్రీసీతారామస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో వీరవాసరం మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత ధ్యానశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా రంగంపేటకు చెందిన ఓషో పిరమిడ్ ధ్యాన ఆశ్రమం వ్యవస్థాపకులు సీనియర్ పిరమిడ్ మాస్టర్ బి.వి.వసంత్ పాల్గొని జ్ఞాన బోధ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత పొందవచ్చునన్నారు. ప్రతిరోజూ ధ్యానసాధనతో పాటు స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ కె.వి.డి.ప్రసాద్, వర్రె విశ్వేశ్వరరావు, సన్నిధి ఉదయ్, వీరవల్లి నరేష్, సత్యనారాయణ, తోలేటి శ్రీరామచంద్రమూర్తి, మంగతాయారు, ప్రభావతి, కృష్ణవేణి, శ్రీదేవి, పైడమ్మ తదితరులు పాల్గొని సామూహిక ధ్యానం చేశారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకూ లబ్ధి

అత్తిలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని పార్టీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. అత్తిలి శివారు అరుంధతీపేటలో ఆదివారం పలువురు మహిళలు, యువకులు, పెద్దలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 5న అరుంధతీపేటలో ఏర్పాటుచేసిన బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే అరుంధతీపేటకు చెందిన యువత, మహిళలకు పార్టీ కండువాలు కప్పి పార్టీలో చేరినట్లు ప్రకటించుకున్నారన్నారని విమర్శించారు. ఈసందర్భంగా వీరంతా వైఎస్సార్ సీపీలో చేరారు. బుద్దరాతి భరణీ ప్రసాద్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

హుషారుగా 'జగనన్నే మా భవిష్యత్'


ముత్యాలపల్లిలో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం


ఆచంట వేమవరంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నాయకులు

యలమంచిలి: 'జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు ఏ ఇంటికి వెళ్లిన ప్రభుత్వ పనితీరుకు అనుకూలంగా స్పందిస్తుండడంతో నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీ నాయకులు గ్రామాలలో పర్యటిస్తే నిరసనలు, నిలదీతలు ఎదురవుతాయి. కానీ జగనన్న పాలనలో పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతుండటతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. అదే విషయాన్ని తమ ఇళ్లకు వచ్చిన వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులకు చెబుతుండడంతో వీరిలో ఆనందం రెట్టింపవుతుంది.

ముత్యాలపల్లిలో..

మొగల్తూరు: 'జగనన్నే మా భవిష్యత్–మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో నాయకులు, గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు చురుగా పాల్గొంటున్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలు అందుతున్నాయో? లేదో? అని అడిగి తెలుసుకుంటున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కొల్లాబత్తుల రవికుమార్ ముత్యాలపల్లిలో ఇంటింటికి తిరుగుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలు ఏమైనా ఉన్నాయా? అఅడిగి తెలుసుకుని సమస్యలు ఏమైనా ఉంటే గృహ సారథుల దృష్టికి తీసుకురావాలని కోరుతున్నారు.

మూడో రోజూ నీరాజనం

పెనుగొండ: 'జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం మూడో రోజు ఆదివారం ఆచంట, పెనుగొండ మండలాల్లో ప్రజలునీరాజనం పలికారు. పెనుగొండ మండలంలో పెనుగొండ చిన్నంవారిపాలెం, వడలి, సిద్ధాంతం, ఇలపర్రు, ములపర్రు, కొఠాలపర్రు, దేవల్లో ప్రతీ గడపగడపకూ వెళ్లి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కన్వీనరు నల్లిమిల్లి వేణుప్రతాపరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు. ఆచంట మండలంలో ఆచంట వేమవరం, కోడేరు, పెనుమంచిలి, వల్లూరు, ఆచంట, కొడమంచిలిల్లోనూ ప్రజలు నీరాజనం పలికారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


ముత్యాలపల్లిలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తుల రాకతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ కొల్లాటి రామారావు, ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గ్రామాల్లో ఈస్టర్ సందడి


లంకలకోడేరు రూపాంతర లూథరన్ చర్చిలో పాస్టర్లను సత్కరిస్తున్న వైస్ ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వరరావు


సిద్ధాంతంలో సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

పాలకొల్లు అర్బన్: ఈస్టర్ పండుగను ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. గత 45రోజుల ఉపవాస దీక్షలను విశ్వాసు లు విరమించారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు పెదపేటలో 1870లో నిర్మించిన రూపాంతర లూథరన్ చర్చిలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్ ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ చర్చి ముందు భాగంలో మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో డ్రెయిన్ పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. అలాగే కోడిదుంప నుంచి వస్తున్న విశ్వాసులకు ఇబ్బందులు లేకుండా వంతెన నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పేరిస్ పాస్టర్ బీవీ రత్నం, సీఆర్ఎస్‌బీ ఆనందంలను సంఘ కార్యదర్శి కర్ణి జోగయ్య, కోశాధికారి విప్పర్తి ప్రభాకరరావు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. సంఘస్థులు నూతన వస్త్రాలు అందంచారు. కార్యక్రమంలో రెవరెండ్ నేలపాటి ఇస్సాక్, మాజీ డెలిగేట్ తోకల జనార్థన్, పీసీసీ పెద్దలు కత్తిమండ ఏసురత్నం, గోగులమండ ఆనందరావు, గోగులమండ మాణిక్యాలరావు, పీతల సురేష్, దాకారపు సాల్మన్‌రాజు, మైలే రమేష్, గొల్ల నతానీయేలు పాల్గొన్నారు.


కొడమంచిలిలో సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న దృశ్యం


నీరుల్లి పాలెంలో ఈస్టర్‌లో సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద ప్రకాష్

పెనుగొండలో..

పెనుగొండ: ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు, విశ్వాసులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. క్రీస్తు శిలువ వేసిన మూడవ రోజున తిరిగి లేచిన సందర్భంగా ఈస్టరు పండుగను జరుపుకుంటారు. ఆచంట, పెనుగొండ మండలాల్లో తెల్లవారు జామునే శ్మశాన వాటికల వద్దకు చేరుకుని గతించిన వారి కుటుంబసభ్యుల సమాధులపై పుష్పాలంకరణ చేసి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఇలపర్రు, సిద్ధాంతం, పెనుగొండ చర్చిల్లో ప్రార్ధనలు నిర్వహించారు. కొడమంచిలి, వల్లూరు, ఎ.వేమవరం, పెనుమంచిలి తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

క్రైస్తవుల విశ్వాసం ఈస్టర్

చనిపోయిన వారు క్రీస్తు రెండవ రాకడలో క్రీస్తుతో పాటు లేచి వస్తారని క్రైస్తవులు విశ్వాసంతో ఈస్టర్ నిర్వహిస్తారని ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. ఆదివారం ఆనంద ప్రకాష్ స్వగ్రామమైన నీరుల్లిపాలెంలో నిర్వహించిన ఈస్టర్ ప్రార్థనల్లో పాల్గొని, తల్లిదండ్రులు, అన్నదమ్ములకు నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఖండవల్లి శ్యాంబాబు, బుడితి ప్రసాద్, చెల్లెం రత్నంరాజు, పాస్టర్ గొల్ల క్రాంతి కుమార్, పాస్టర్ మట్ట యోహాన్ పాల్గొన్నారు.

నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు


యలమంచిలి మండలం మేడపాడులో పూర్తి స్థాయిలో నిండిన చెరువు

యలమంచిలి: వేసవిలో ప్రజలకు నీటి ఇబ్బంది లేకుండా మంచినీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓపీఆర్డీ కాటూరి మణిక్య వైభావతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మర్రిపూడి సురేష్‌బాబు తెలిపారు. యలమంచిలి మండలంలో 14 గ్రామాల్లో 18 మంచినీటి చెరువులు ఉన్నాయి. ప్రస్తుతం మేడపాడు, కలగంపూడి గ్రామాల్లో మంచినీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపగా మరొక ఏడు చెరువులు 70 శాతం నింపామని వారు వివరించారు. మిగిలిన చెరువులన్నింటినీ ఈ నెల 18 నాటికి పూర్తి స్థాయిలో నింపడానికి ప్రణాళిక రూపొందించినట్లు వారు చెప్పారు. ఊటాడ, నేరేడుమిల్లి, కాజ పడమర లాంటి గ్రామాలలో మంచినీటి చెరువులు చిన్నవి కావడంతో వేసవి మధ్యలో చెరువులో నీరు నిండుకున్నా ప్రజల అవసరాలకు ఆటంకం కలగకుండా ట్యాంకర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు.

ఎంపీటీసీ సభ్యురాలు రత్నకుమారి మృతి



పాలకొల్లు అర్బన్: మండలంలోని ఆగర్రు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు, ఎంపీటీసీ సభ్యురాలు కొయ్యే రత్నకుమారి (45) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. గతేడాదిలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో రత్నకుమారి వైఎస్సార్ సీపీ నుంచి ఎంపీటీసీగా పోటీ చేసి సుమారు 700 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గత నెలలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆమె వీల్‌ఛైర్‌లో వెళ్లి నరసాపురం ఆర్డీఓ కార్యాలయంలో ఓటు వేశారు. ఆమెకు భర్త భాస్కరరావు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. రత్నకుమారి భౌతిక కాయాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, సర్పంచ్ సాకా గంగారత్నం, వై స్ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వరరావు, కోఆప్షన్ మెంబర్ తండా ఇస్సాక్ రాజు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

ఉమా రామలింగేశ్వరునికి లక్ష బిల్వార్చన


వెలివెలలో ఉమా రామలింగేశ్వర స్వామివార్లకు లక్ష బిల్వార్చన పూజలు చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని వెలివెల గ్రామంలో వేంచేసియున్న శ్రీ ఉమా సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి, శ్రీ రాధాకృష్ణ స్వామివార్ల కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆదివారం స్వామివార్లకు లక్ష పత్రి పూజ చేశారు. బోడపాటి వెంకట నారాయణ వెంకట లక్ష్మీ పార్వతి, బోడపాటి విజయ్‌కుమార్ – లక్ష్మీ నాగమణి, జడ్డు నాగ వెంకట సురేష్ – శివజ్యోతి దంపతులతో అర్చకస్వామి పుల్లేటికుర్తి సత్య వెంకట నాగభూషణం బ్రహ్మత్వంలో పూజలు చేశారు. విఘ్నేశ్వరుని పూజ, ఏకాదశ రుద్రాభిషేకాలు, సూర్య నమస్కారాలు, అమ్మవార్లకు సహస్ర కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్ల నిత్య కైంకర్యం నిమిత్తం గ్రామ పెద్ద బోడపాటి మునిచక్రవర్తి రూ.2లక్షలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కెల్లా సింహాచలం, ఉపసర్పంచ్ కందుల వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు బుజ్జి, మహిళలు, యువజనులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా సూర్యహోమం


సూర్య భగవానుడికి పూజలు చేస్తున్న దంపతులు

పాలకొల్లు సెంట్రల్: కరోనా వ్యాధి విజృంభిస్తున్న తరుణంలో దానిని అరికట్టడానికి ప్రారంభించిన శ్రీ సూర్య హోమం ఆదివారంతో 150వ హోమం పూర్తి చేసుకుంది. నిర్వాహకులు కేవీఎల్ నరసింహరాజు మాట్లాడుతూ 2020 మే 31న ప్రారంభించిన ఈ సూర్యహోమం నేటి ఆదివారానికి 150 వారాలు పూర్తి చేసుకుందన్నారు. స్థానిక కోడిగట్టు సరస్వతి శిశుమందిర్‌లో దాతలు, భక్తుల సహకారంతో ప్రతీ ఆదివారం సూర్యహోమం నిర్వహిస్తూ వచ్చామన్నారు. పురోహితులు రవీంద్ర బ్రహ్మత్వంలో బోడా వెంకట సుబ్రహ్మణ్యం దంపతులు ఈ హోమంలో పాల్గొన్నారన్నారు. సూర్య హోమం అనంతరం ఆదిత్య హృదయం సామూహిక పారాయణ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శృంగవృక్షం దత్తపీఠం స్వామీజి సాయిదత్త నాగానంద సరస్వతి పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం 250 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో వేదాంత వెంకట్ నారాయణ, గాదె బాబు, గోనుగుంట రంగారావు, రేపాక ప్రవీణ్‌భాను, చాగంటి లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోక పఠన పోటీలు

భీమవరం (ప్రకాశంచౌక్): భగవద్గీత శ్లోక పఠన పోటీలకు విశేష స్పందన వచ్చింది. ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో భీమవరం ఆనంద ఫంక్షన్ హాల్లో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభించారు. జిల్లా నలుమూలనుంచి చిన్నారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. చిన్నారులు భగవద్గీతను పఠిస్తున్నంత సేపు ఆహుతులు తన్మయత్వం చెందారు. ఈ సందర్భంగా యూకే విశ్వనాథరాజు మాట్లాడుతూ భగవద్గీత శ్లోకాలు అందరికీ రావాలని, ప్రతీ ఒక్కరూ భగవద్గీత చదవాలనే అనే ఉద్దేశ్యంతో వయస్సుతో సంబంధం లేకుండా 5 సంవత్సరాల నుండి 80 సంవత్సరాలు వరకురున్న వారికి కూడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సహస్రావదాని కడిమెళ్ల వరప్రసాద్ మాట్లాడుతూ భగవద్గీతను చదవడం వల్ల, ఆలపించడం వల్ల ముక్తిని పొందవచ్చన్నారు. అనంతరం పోటీలు నిర్వహించారు. పోటీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ ప్రశంసాపత్రంతో పాటు భగవద్గీత పుస్తకాన్ని అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు దాయన సురేష్ చంద్రజీ, కంతేటి వెంకట్రాజు, ఎన్టీఓ రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండి: మంచినీటికి బదులుగా ఏపొరపాటున కలుపుమందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం కోలమూరు గ్రామానికి చెందిన పెచ్చెట్టి గొల్లారావు, పోసమ్మ దంపతుల కుమారుడు వెంకటదుర్గాపవన్‌కుమార్ (25) ఉండి శివారు శ్రీరామపురంలో కూరగాయల సాగు చేసుకుని జీవిస్తున్నాడు. శనివారం పొలంలో పనిచేస్తూ దాహంగా ఉందని అందుబాటులో ఉన్న బాటిల్‌లో ఉన్న నీటిని తాగాడు. అయితే అది పొలంలో కొట్టేందుకు తెచ్చిన కలుపు మందు అని తరువాత తెలుసుకున్నాడు. తరువాత అతనికి కడుపు నొప్పి రాగా, దానిని పెద్దగా పట్టించుకోలేదు. మరికొంత సేపటికి నొప్పి తీవ్రం కావడంతో సోదరుడికి విషయాన్ని తెలియజేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతనిని 108 వాహనంలో భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆదివారం ఉదయానికి పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఎస్సై కె.గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆకట్టుకున్న హరికథా సప్తాహం


శ్రీరామ సుగ్రీవ మైత్రి హరికథ సప్తాహం చెబుతున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక త్యాగరాజ భవనంలో చెరుకువాడ సోదరుల నిర్వహణలో హరికథ సప్తాహ మహోత్సవాలలో భాగంగా నాలుగో రోజు ఆదివారం హరికథ భాగవతరాణి పురాణం విజయలక్ష్మి (రాజమండ్రి) వారితో శ్రీరామ సుగ్రీవ మైత్రి హరికథ అద్భుతంగా ప్రదర్శించారు. సూర్పణకకు లక్ష్మణుడు చెవులు ముక్కులు కోయడం తన అన్న అయిన లంకాధీసుడు రావణాసురుడికి దగ్గరకు వెళ్లడం ఆయన ఆగ్రహించడం రాక్షసుడైన మారీచుడిని పిలిచి వారెవరో తెలుసుకో అనడం మారీచుడు వారు బ్రహ్మ ఋషులగా ఉన్నారని, చూడటానికి ఎదురు పడలేక పోయాయని చెప్పడం .. రావణుడు కోప్రోద్రుక్తుడై మారీచుడిని మాయ జింక రూపంలో వెళ్లి వారిని ఏమార్చమానడం .. ఆ ప్రకారం మారీచుడు ఈ రాక్షసుని చేతిలో చావడం కన్నా ఆ మహనీయుని చేతిలో మరణించడం గొప్ప భావించడం వంటి ఘట్టాలతో హరికథ చెప్పారు. ఈ హరికథలో సహ వాయిద్యకారులుగా పాలపర్తి అంజనేయులు (విజయవాడ), మృదంగంతో కాపవరపు సుబ్బారావు (భీమవరం) వయోలిన్‌తో సహకరించారు. ఈ కార్యక్రమాన్ని సాగి విఠల్ రంగరాజు సహకారంతో నిర్వహించామని చెరుకువాడ సోదరులు తెలిపారు. ఏఎస్పీ సుబ్బరాజు జ్యోతి ప్రజ్వలన చేసి కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ గంధం వెంకట విశ్వేశ్వరరావు, తిరువీధి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ బొమ్మిడి నారాయణరావు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసాపురం డివిజన్
9010223729 (ఆచంట)
9010201609 (నరసాపురం)
9505507552 (పాలకొల్లు)
Office mail : tpgadvt@gmail.com

వేగంగా అండర్ గ్రౌండ్ డ్రెయిన్ నిర్మాణ పనులు


యలమంచిలి మండలం అడవిపాలెంలో అండర్ గ్రౌండ్ డ్రెయిన్ కం సిమెంట్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యలమంచిలి: అడవిపాలెం గ్రామంలో పాలకొల్లు–దొడ్డిపట్ల రోడ్డును ఆనుకుని పల్లపు వీధి ఉంటుంది. సుమారు 90 మీటర్ల పొడవు మాత్రమే ఉండే ఈ రోడ్డు పాలకొల్లు–దొడ్డిపట్ల రోడ్డు కన్నా సుమారు నాలుగు అడుగులు పల్లంగా ఉంటుంది. కనుకనే ఈ వీధికి పల్లపు వీధి అనే పేరు వచ్చింది. వర్షా కాలం వచ్చిందంటే ఈ రోడ్డు పిల్ల కాలువ తలపిస్తుంది. ఆ సమయంలో ఈ వీధిలో నివసించే సుమారు 20 కుటుంబాల వారు అడుగు తీసి బయటపెట్టలేని దుస్థితి నెలకొంటుంది. దశాబ్ధాలు కాలంగా ఈ దుస్థితిని ఎవరూ తొలగించలేదు. ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ ఈ ప్రాంతంలో పర్యటించినపుడు స్థానికులు తమ గోడు వెలబోసుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన రోడ్డు నిర్మాణానికి జెడ్పీ నిధులు రూ.5 లక్షలు మంజూరు చేశారు. అయితే రోడ్డు వెడల్పు మూడు మీటర్లు మాత్రమే ఉండుటతో సిమెంట్ రోడ్డు వేసిన డ్రయిన్ నీరు వెళ్లే మార్గం ఉండదు. దీంతో స్థానిక నాయకులు తోట రామకృష్ణ, గవర సర్వేశ్వరరావులు ఆలోచన చేసి రోడ్డు మధ్యగా అండర్ గ్రౌండ్ డ్రెయిన్ ఏర్పాటుచేసి సిమెంట్ రోడ్డు వేయాలని నిర్ణయించారు. అదే సమయంలో రోడ్డు ఎత్తును పాలకొల్లు–దొడ్డిపట్ల రోడ్డుకు సమాంతరంగా నిర్మించాలని నిర్ణయించారు. అయితే ఈ పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో తోట రామకృష్ణ ముందుకు వచ్చి సుమారు మూడున్నర అడుగుల ఎత్తున నల్ల మెటల్ రోడ్డు పైన సిమెంట్ రోడ్డు నిర్మించడానికి ముందుకు వచ్చారు. ప్రస్తుతం అండర్ గ్రౌండ్ డ్రెయిన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అనుకున్నది అనుకున్నట్లు జరిగితే పల్లపు వీధి కాస్తా మెరకవీధి అవుతుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.